




డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఈనెల 20 నుంచి జరిగే మొదటి సంవత్సరం డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించి పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.నరేంద్ర డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇబ్బందికరంగా ఉండే సెంటర్లను గుర్తించి సిట్టింగ్ స్క్వాడ్,ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల న్నారు. విద్యార్థులకు ఎగ్జామ్స్ సెంటర్ల వద్ద వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రవాణా శాఖ పరీక్షల సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పరీక్షలకు తరలివచ్చే ప్రాంతాలకు ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.



వి నరేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

వైసిపిలో 'వంకి' చేరిక

కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జిగా కటారి అరవింద యాదవ్ - ఆందోళనలో మహీధర్‌రెడ్డి అనుచరులు

ప్రజాశక్తి-కందుకూరు : అంతా అనుకున్నట్లే అయింది.. సాధారణ ఎన్నికల వ్యూహంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అధిష్ఠానం చేపట్టిన ఇన్‌ఛార్జుల మార్పు ప్రభావం కందుకూరు పైనా పడింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కటారి అరవింద యాదవ్‌ను కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ వైసీపీ అధిష్ఠానం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ వంకి పెంచలయ్య కుమార్తె, తమిళనాడు రాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ మంత్రి కె పొన్ముడి కోడలైన కటారి అరవింద యాదవ్ నియామకం ప్రకటన కందుకూరు నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం ఎక్కడ నలుగురు చేరినా నియోజకవర్గం అంతా ఇదే చర్చ నడుస్తోంది. వైసీపీ అధిష్ఠానం చేపట్టిన అనేక సర్వేలలో సైతం జిల్లాలో వైసీపీ గెలుపు అభ్యర్థులలో జాబితాలో ముందు వరుసలో ఉన్న స్థానిక శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డిని కాదని మన రాష్ట్రం దాటి పక్క రాష్ట్రం నుంచి అభ్యర్థులను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. ఎవరిని తెచ్చిపెట్టినా జనం నన్ను చూసే ఓటేస్తారన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒంటెద్దు పోకడ మరోసారి నిరూపితమైందని మహీధర్ రెడ్డి అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహీధర్ రెడ్డి అనుచరులలో అలజడి. కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జిగా వంకి పెంచలయ్య కుమార్తె అరవింద యాదవ్‌ను నియమిస్తున్నట్లు వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటలకే భారీ సంఖ్యలో మహీధర్ రెడ్డి అనుచరులు కందుకూరు-పామూరు రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. వైసీపీ అధిష్ఠానం నిర్ణయం పై మహీధర్‌రెడ్డి స్పందన ఎలా ఉంటుందని తెలుసుకునేందుకు అను చరులు ప్రయత్నిం చినప్పటికీ ఆయన మాత్రం ఎందుకు ఆందోళన చెందుతున్నారు.. ఇంకా సమయం ఉంది కదా అని సమాధానం దాట వేస్తున్నట్లు చెబుతున్నారు. దీనిపై నియోజకవర్గ వైసిపి కార్యకర్తలు పలువురు మహీధర్ రెడ్డి వైసీపీకి రాజీనామా చేస్తారా.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా.. లేక ఇప్పటివరకు తన ప్రత్యర్థి పార్టీ అయిన టిడిపిలో చేరతారా.. అంటూ తమ ఆందోళనను వెళ్లబుచ్చు తున్నారు.కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మార్పుపై నియో జకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు కొంత ఆనందోత్సాహలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన అనుచరులు మాత్రం ఎన్నికల సమయానికి వైసిపి బీ ఫారం మహీధర్ రెడ్డికె ఇస్తారని ఆశిస్తుండడం గమనార్హం.



కందుకూరులోని మానుగుంట కార్యాలయంలో వైసిపి శ్రేణులు

'సింహపురి' బాలోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -నెల్లూరు : బాల్యం దశలోనే విద్యార్థులకు విద్యతోపాటు విద్యతోపాటు, వారిలో దాగివున్న క్రీడ, కళ నైపుణ్యాన్ని గుర్తించి ఆదిశగా ప్రోత్సహించి ప్రతిభా వంతులుగా తీర్చిదిద్దాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం దర్గామిట్ట వద్దనున్న కస్తూరిదేవి బాలికల పాఠశాలలో 'సింహపురి బాలోత్సవ' 20 24 (పిల్లల పండగ) రెండు రోజుల కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమాలకు సంఘమిత్ర స్కూల్ కరస్పాండెంట్ కె రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్ర మణ్యం, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లా డుతూ విద్యార్థులు తమ తెలివితేటలను ప్రదర్శించేందుకు ఒక వేదిక అవసరమన్నారు. అది సింహపురి బాలోత్సవం 2024 (పిల్లల పండగ) అని చెప్పేందుకు సంతోషిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు స్వేచ్ఛగా మాట్లాడుకు నేందుకు, తమ మనసులోని భావా లను ఇతరులతో పంచు కునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడ తాయ న్నారు. పోటీలు పెట్టడం కోసం ఈ బాలోత్సవ కార్యక్ర మం చేయడం లేదని, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి తెలివితేటలను ప్రదర్శించు కోవాలన్నదే ఈ కార్య క్రమం ముఖ్య ఉద్దేశ్యమ న్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిం చాలంటే ముందు బడులు మారాలన్నారు. విద్యార్థులను ప్రశ్నించే స్థాయికి తీసుకురా వాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కె రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్య చాలా ముఖ్యమే.. కానీ పిల్లలు ఒత్తిడితో కష్టపడి కాక, ఇష్టపడి చదవా లన్నారు. వారి అభిరుచులను, సజనాత్మ కతను, జ్ఞానతష్ణను ప్రోత్స హించే పరిస్థితులు కల్పిం చాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మాట్లా డుతూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించ డంతోపాటు క్రీడలు, కళా నైపుణ్యాన్ని గుర్తించి ఆదిశగా వారిని ప్రోత్సహిం చాల న్నారు. సమాజంలో మంచి గుర్తింపు తీసుకొచ్చేందుకు మార్కులు, ర్యాంకులే కాదన్నారు. ఎంఇఒ హమీద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఆటలు, కళల పట్ల నైపుణ్యం ప్రదర్శించుకొనేందుకు సమయం కేటా యించాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.నవకోటేశ్వరరావు మాట్లా డుతూ విద్యార్థులు బాల్య దశలో ఆట, పాట, కళ ఆధారిత అంశాలల్లో సరదాగా గడపాల్సిన అవసరముం దన్నారు. వెస్ట్రన్, జానపద నృత్య పోటీలు, పాటలపోటీలు, చిత్రలేఖన పోటీలు సీనియర్, జూనియర్ విభాగాలల్లో నిర్వహించారు.భోజన విరామం అనంతరం తెలుగులో కథా రచన, కవితా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నగరంలోని సుమారు 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజ రయ్యారు. సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, ఎం సత్యనారాయణ, మధు సూధన్‌బాబు, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఉదయభాస్కర్, జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు విపినరసింహారెడ్డి, కాంత్రికుమార్, జి.మాల్యాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం



కంటైనర్లు ఖాళీగా వచ్చాయి..

ఇందంతా ప్రభుత్వ నాటకం - మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ తరలిపోతుదని, ఈ విషయం బయటపెట్టడంతో ప్రభుత్వం, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెజల్స్ ఇక్కడకు తీసుకొచ్చారని, అవి ఖాళీ కంటైనర్లు అని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టులో కంటైనర్ టెర్మినల్ నుంచి సర్వీసెస్ లేవు..లైనర్ కంపెనీకి అదానీ ప్రతినిధులు తెలిపారన్నారు. శుక్రవారం వచ్చిన కంటైనర్లే అన్ని ఖాళీవేనన్నారు. కేరళలోని అదానికి చెందిన పోర్టులో రద్దీ కారణంగా వాటిని ఇక్కడ దించారన్నారు. ఇప్పటికే ఉపాధి కోల్పోయిన 10 వేల కుటుంబాలకు నిన్న వచ్చిన ఖాళీ కంటైనర్లతో ఉపయోగం శూన్యమన్నారు. ఫిబ్రవరికి సంబంధించిన వెజల్స్ షెడ్యూల్‌ను ఈ రోజుకీ విడుదల చేయలేదని, . అంటే కంటైనర్ టెర్మినల్‌ను మూతేసినట్టేనా అని ప్రశ్నించారు. కంటైనర్ టెర్మినల్ తమిళనాడుకు తరలిపోవడంతో ఇప్పటికే రాయలసీమ, కోస్తా జిల్లాల రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఏ రోజూ నిజాలు చెప్పలేదన్నారు. మంత్రి అయిన తెల్లారి నుంచే వైసీపీలో వరుసగా వైసీపీలో ఎమ్మెల్యే, ఎంపి వికెట్లు పడిపోతున్నాయని, ఆయనది ఐరన్ లెగ్ అన్నారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ మూతపడిపోగా, మరోవైపు వైసీపీ కూడా మూతపడుతోందన్నారు. కంటైనర్ టెర్మినల్‌కు సంబంధించిన రికార్డులను మీడియాకు చూపించారు. కంటైనర్ టెర్మినల్ మూతపడితే ఎమ్మెల్యే, మంత్రి పదవుల్లో కొనసాగనని శపథాలు చేశాడని, ఇప్పుడు కథలు చెబుతున్నారని విమర్శించారు. అఖిలపక్షంలోని పార్టీల నేతలందరం పోర్టు సిఇఒను కలిసి కంటైనర్ టెర్మినల్ ను కొనసాగించాలని కోరామన్నారు. వెజల్ వస్తే విదేశాల నుంచి ఏదొకటి దిగుమతి కావాలి, లేదంటే పత్తి, మిర్చి, రొయ్యలు, చేపలు, బియ్యం, పొగాకు ఎగుమతి కావాలని, ప్రస్తుతం పోర్టులో ఉన్న ఖాళీ కంటైనర్ల ద్వారా ఏమి జరగబోతోందని అర్థం కావడం లేదన్నారు. సౌత్ ఆఫ్రికాలోని డర్బన్‌కు ఎగుమతులు జరపడానికి వెజల్ షెడ్యూల్ ఇవ్వాలని ఆ మెయిల్ ద్వారా కోరారు నెలకు 14 వెజల్స్ వస్తుంటాయని,ఈ నెలలో కనీసం 8 వెజల్స్ అయిన తీసుకురావాలని కోరుతున్నా. ఇప్పుడేమో ఖాళీ కంటైనర్లను తెచ్చి అక్కడ పడేసి వెళ్లారన్నారు. మొన్నటి వరకు కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్ ద్వారా బియ్యం, పొగాకు, మిర్చి, పత్తి, రొయ్యలు, చేపలు తదితర ఉత్పత్తులను ఎగుమతి చేసేవారన్నారు. ఇవన్నీ నిలిచిపోతున్నాయన్నారు. వాస్తవాలు చెప్పకుండా ఏదో మాయ చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పోర్టుతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమల కోసం 16 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేశారని గుర్తు చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కంటైనర్ సేవలు కొనసాగుతాయి..

కావాలనే దుష్ప్రచారం: మంత్రి కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌సేవలు కొనసాగుతాయని, నిన్న వచ్చిన విజల్ ఇందుకు ఉదాహరణమన్నారు. శనివారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కంటైనర్ సేవలు నిలిపేస్తున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పోర్టులో కంటైనర్ సేవలు లేకపోతే తానే పోరాటం చేస్తామని చెప్పానన్నారు. అఖిల పక్ష పార్టీలు ప్రజల పక్షాన నిలబడాలన్నారు. సమస్య ఉంటే అధికార, ప్రతిపక్షపార్టీలు పోరాటం చేయాల్సిందేనన్నారు. పోర్టు యాజమాన్యం, ప్రభుత్వం పదే పదే చెబుతున్నా అందులో వాస్తవం లేదన్నారు. ఎంతో కష్టపడి నిర్మించుకున్న కంటైనర్ టెర్మినల్‌ను ఎందుకు మూసేస్తామన్నారు. శుక్రవారం వెజల్ వచ్చిందని, సుమారు 4200 కంటైనర్లు వచ్చాయన్నారు. రాజకీయంగా బురద చల్లాలనే ఉద్దేశంతోనే తనపై ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలు, అఖిల పక్ష పార్టీలు వాస్తవాలు గమనించాలన్నారు. అఖిల పక్షాలు సొంత ఉద్యమాలు చేశారని, సిఎంకు లేఖ రాశారన్నారు. టెర్మినల్ కొనసాగాలని అందరూ కోరుతున్నారన్నారు. కేవలం నన్ను, ప్రభుత్వాన్ని తిట్టడానికే సోమిరెడ్డి ప్రాధాన్యత ఇన్స్తున్నార న్నారు, సెమ్‌కాప్ విషయంలో టిడిపిలో పోరాటం చేసి, అధికారంలోకి వచ్చాక సపోర్టు చేశారని తెలిపారు. నాన్ బెయిలబుల్ కేసులు పెట్టిం చారన్నారు. యాఫ్ పాంట్ ఏర్పాటు చేశాం న్నారు. సంస్థను దెబ్బతీయడానికే అబాండాలు వేస్తున్నారని, ఇదే జరిగితే పోర్టును మూసేస్తారన్నారు. తల్లిలాంటి సంస్థను దెబ్బతీయొద్దని పోర్టు సిఇఒ కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్నారు. సర్వేపల్లిలో మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందన్నారు. మరోసారి సోమిరెడ్డికి ఓటమి తప్పదన్నారు. కంటైనర్ సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయని, ఆగే పరిస్థితులులేవన్నారు. నాయకులు, కార్యకర్తల్లో ఆయనపై వ్యతిరేకత ఉందన్నారు. పోర్టు ఉంటుందో లేదో యాజమాన్యం చెప్పాలని, సోమిరెడ్డి చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. సైదాపురంలో కాకాణి అక్రమ మైనింగ్ కొనసాగుతుందని చెప్పారని, దానిని నిరూపించలేక పోయారన్నారు. ఇప్పుడు ఆ విషయం మాట్లాడడం లేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఇస్రోకు విపిఆర్ అభినందనలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శనివారం చేపట్టిన ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడంపై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభినందనలు తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జిఎస్ఎల్‌వి -ఎఫ్14 ద్వారా ఇన్‌శాట్-3డిఎస్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టడం దేశానికే గర్వకారణమన్నారు. వాతావరణ మార్పులపై ఈ ఉపగ్రహం పరిశోధిం చనుందన్నారు. ఈ ఘనత సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగంతో ఇస్రో అంతరిక్ష రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సాధించిందని చెప్పారు.

వేతనంతోకూడిన సెలవులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి నెల్లూరు : ఆచార్య ఎన్. జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రోజువారి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెబాట పట్టారు. నగరంలోని ఆకుతోట ప్రాంతంలోని ఆచార్య ఎన్‌జి రంగా రీసెర్చ్ వ్యవసాయ క్షేత్రంలో కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ జారీ చేసిన జాతీయ పండుగ సెలవులు (వేతనంతో కూడిన) కాంట్రాక్ట్ లేబర్ అందరికీ ఇవ్వాలన్నారు. కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రు.20 వేలు ప్రమాదవశాత్తు మరణిస్తే రు. 50 వేలు పరిహారం చెల్లించేందుకు జారీ చేసిన జిఒను కాంట్రాక్ట్ లేబర్ కూడా వర్తించేలా చేయాల న్నారు. సిఐటియు రూరల్ ప్రధాన కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడుతూ పని ప్రదేశంలో కార్మికులు పాముకాటుకు, ఇతర ప్రమాదాలకు గురైనప్పుడు రీసెర్చ్ స్టేషన్ అధికారులు బాధ్యత తీసుకొని వైద్యం చేపిచ్చేలా చర్యలు తీసుకోవాలని, యూని వర్సిటీ పరిధిలో ఖాళీ పోస్టుల భర్తీలో కాంట్రాక్ట్ కార్మికులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సిఐటియు నాయకులు ప్రసాద్ కార్మికులు శ్రీదేవి, నాగ భూషణం, రమ్య, సుబ్బులమ్మ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్

బిటిఎ వినతి

ప్రజాశక్తి నెల్లూరు : మార్చిలో జరిగే ఇంటర్, పది పరీక్షలు, అలాగే తదుపరి జరిగే స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, బాలింతలకు, గర్భిణులకు, 58 సంవత్సరాలు వయస్సు పై బడిన టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని బిటిఎ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి రామా రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘం బిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి. రమేష్, ఆర్థిక కార్యదర్శి ఆది నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, కష్ణయ్య, రాజ్ శేఖర్, మల్లిఖార్జున్ ,డానియల్, రవీంద్రనాథ్,శంకరయ్య, చెన్న కేశవ, వెంకట సిద్ధార్థ, మస్తాన్, హరి, చక్రపాణి ఉన్నారు.

'బర్డ్ ఫ్లూ' నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - నెల్లూరు : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో విస్తతంగా బర్డ్ ఫ్లూ నివారణ చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు ఆధ్వర్యంలో పశు వైద్యాధికారులు సిబ్బంది, ఆధ్వర్యంలో గుమ్మల్ల దిబ్బ, దామరమడుగు, చాటగొట్ల గ్రామాలలో రాపిడ్ బందాలతో పర్యటించి బర్డ్ ఫ్లూ నివారణ చర్యలు చేపట్టారు. చాటగొట్ల సమీపంలోని కోళ్ల ఫారం షెడ్ ను పంచాయితీ అధికారులు మూసి వేయించారు. పలు గ్రామాలలో చికెన్ దుకాణాలను మూసివేయించారు. గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. కోళ్ల వ్యాధులను వ్యాప్తి చెందకుండా 344 కోళ్లను చంపి వేసినట్లు కోడి గుడ్లను పగలగొట్టినట్లు జెడి తెలిపారు.. జెడ్‌పి సిఇఒ కన్నమ నాయుడు ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి చికెన్ దుకా ణాలను తెరవకుండా చర్యలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా పంచాయితీ అధికారి సుస్మిత ఆధ్వర్యంలో పొదలకూరు మండలంలోని 24 పంచాయతీల్లో బ్లీచింగ్ చల్లడం , పరిసరాలను శుభ్రం చేయడం వంటి పారిశుధ్య కార్యక్ర మాలు నిర్వహించారు. గ్రామాల్లోకి కోళ్ళను తరలించకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు డిపిఒ తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -పొదలకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో శరవేగంగా అభివద్ధి పనులు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీలో శనివారం ఆయన వివిధ అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి గ్రామాల్లో గొడవలు పెట్టడం తప్ప గ్రామాలు శాంతియుతంగా ఉండాలని ఎప్పుడూ కోరుకోడని తెలిపారు. ఆ గ్రామంలో అనేక సందర్భాల్లో మెజార్టీ తగ్గిందని పేర్కొన్నారు. మెజార్టీ తగ్గినా తన కోసం స్థానికంగా ఉండే నాయకులు పోరాడుతున్నారని.. వాళ్ల కోసం పనిచేస్తానన్నారు. తనకు ఓట్లు వేయకపోయినా, గ్రామంలో అభివద్ధి పనులు చేసినట్లు తెలిపారు. అనంతరం సంగం రోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన తన తండ్రి కాకాణి రమణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చిట్టేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు సిమెంట్ రోడ్లకు,పలు అభివద్ధి పనులకు ప్రారం భోత్సవాలు జరిపారు. పొదలకూరు జడ్పిటిసి తెనాలి నిర్మలమ్మ ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి. గోపాల్ రెడ్డి, పి. రమణారెడ్డి, కే. చిన్న బ్రహ్మయ్య, వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి, సోమా అరుణ, బి. సురేష్ కుమార్ రెడ్డి, వాకాటి శ్రీనివాసులు రెడ్డి, ఎం. శేఖర్, మద్దిరెడ్డి రమణారెడ్డి, సోమా భాస్కర్, శివకుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేసే ప్రక్రియలో ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరుతూ ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి ఎపిజిఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజెర్ల సుధాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని ఎంఎల్‌సి క్యాంపు కార్యాలయంలో కలిసిన జిల్లా జనరల్ సెక్రెటరీ దేవి రెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి పలు సమస్యలపై చర్చించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పిల్లి హరీష్ రెడ్డి, వీఆర్ఏ రాష్ట్ర అధ్యక్షులు మర్రి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా ట్రెజరర్ బాలరాజు, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున, జిల్లా నాయకులు సునీత, అశోక్ ,ఉమర్ ఉన్నారు.



ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి -నెల్లూరు : ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈనెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఏడు రోజులపాటు కాకుపల్లి, గమళ్లపాలెంలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం కృష్ణపట్నం పోర్టులోని ఆదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజర్ ఎస్.కె. బాషా, సీనియర్ ట్రైనింగ్ ఆఫీసర్ జీవన్, ఇండస్ట్రి యల్ ట్రైనింగ్‌పై అవగాహన కల్పించారు. ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు అందరూ సేవా భావం కలిగి ఉండాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే విద్యార్థులుగా ఉండాల న్నారు. సేవా దక్పథాన్ని అల వర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్ర మంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. పుల్లయ్య గారు, ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ అంకయ్య, వర్మ, మహీధర్ పాల్గొన్నారు. పలువురు అతిథులను సన్మానించారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పారిశుధ్య కార్మికులకు తీవ్రగాయాలు

నెల్లూరు : నగరంలోని ఎన్‌టిఆర్ నగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పారిశుధ్య కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. శనివారం ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతంలోని జాతీయ రహదారిపై భారీ వాహనం అతివేగంగా జాతీయ రహదారి డివైడర్ పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులపైకి లారీ దూసు కొచ్చింది. డివైడర్ పక్కన టాక్టర్ నిలిపి చెత్త వేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు కావడంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు హుటాహుటిన వారిని వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మాలకొండ' ఆదాయం రూ. 6.47 లక్షలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని మాల్యాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడినెలకొంది. శనివారం వివిధ రూపాల్లో రూ. 6, 47178 ఆదాయం వచ్చి నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కె బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

ప్రజాశక్తి - పొదలకూరు : బర్డ్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మండల ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ కొద్ది రోజులపాటు చికెన్ వంటి మాసాం హారం తీసుకోవద్దని మహమ్మదాపురం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు ప్రజలకు విజ్ఞప్తి చేవారు. మండలంలో చాటగోట్లలో బర్డ్ ఫ్లూకి సంబంధించిన ఆనవాళ్లు కనిపించిన కారణంగా ప్రజలందరూ మాంసాహారం తీసుకోవద్దని సూచించారు. ప్రజలందరూ కూడా ఫ్లూ, జ్వరం లాంటివి లక్షణాలు కనిపిస్తే వెంటనే మీ పరిధిలోని ఆశా కార్యకర్తకు గానీ, సంబంధిత వైద్య సిబ్బందికి గానీ వెంటనే తెలియజేయాలని సూచించారు.

మీడియా సహకారంతో మరింతగా ప్రజల్లోకి..

- ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచే మీడియా మిత్రులు తమ పూర్తి సహకారం అందిస్తే ప్రజలకు మరింతగా సేవలు అందించేందుకు వీలవుతుందని, ఆ దిశగా మీడియా మిత్రులు సహకారం అందించాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రయివేట్ కళ్యాణ మండపంలో ఆత్మకూరు నియోజకవర్గ మీడియా మిత్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యునిగా రెండు సంవత్సరాల కాలంలోనే సీనియర్ రాజకీయ నాయకులను తలదన్నే విధంగా ప్రజాశ్రేయస్సుకై ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఇంటి స్థలాలు లేని జర్నలిస్టులకు తప్పనిసరిగా ఇంటి స్థలాలందించే విధంగా ఎంఎల్ఎ మేకపాటి సహకారం అందించాలని, ఉన్నత విద్యావంతుడైన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి నియోజక వర్గం అభివృద్ధిలో వస్తున్నారన్నారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ్యునిగా రెండేళ్ల కాలంలో మీడియా మిత్రులందరి సహకారంతో ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటనలు, కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించి ప్రజల ఆశీర్వాదం పొందామని తెలిపారు. రానున్న రోజుల్లో జర్నలిస్టులు కోరినట్లుగా ఇంటి స్థలాలు అందించేందుకు ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం జర్నలిస్టులు ఒక కమిటీగా ఏర్పడితే పని మరింత వేగంగా, సులభంగా అవుతుందన్నారు.

ఎన్‌జిఒల నిరసన



ప్రజాశక్తి-కోవూరు : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు శనివారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు దిలీప్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ, పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 30 శాతం మంజూరు చేయాలని, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ చేపట్టాలని, ఆరోగ్య కార్డులను మంజూరుచేయాలని, ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, అన్ని శాఖల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరెంట్ సరఫరా చేయాలని వినతి

ప్రజాశక్తి-కావలి రూరల్

కావలి డివిజన్ పరిధిలో కరెంట్ కోతలతో రైతులు అనేక ఇబ్బందుళ్లు ఎదుర్కొంటున్నారని, రైతులకు సాగునీటి కోసం 9గంటలు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ డిఇకి శనివారం సిపిఐ రైతుసంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేమూరి శివశేఖర్ రెడ్డి, ఎపి వ్యవసాయ జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలో రైతులు తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్న ఇటువంటి పరిస్థితుల్లో వేయడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడిందని, వ్యవసాయ సాగులో వేసవికాలం లేకుండా విద్యుత్ కోతలు పెరిగాయన్నారు. కరెంట్ సరిగ్గా సరఫరా కాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయ బోర్లకు 9గంటలు ఫ్రీ కరెంట్ ఇవ్వటం లేదని, రైతుల మనుగడ కష్టమని రైతులు లబోదిబో అంటున్నారన్నారు. రైతులకు కనీసం 7గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదని తెలిపారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో రైతులకు తెలియడం లేదన్నారు. ఇప్పటికైనా రైతు సాగు నీటి కోసం కోతలు లేకుండా నిరంతరం 9గంటలు కరెంట్ సరఫరా చేయాలని కోరారు.

జెవివి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కావలి



కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కావలిలోని రెడ్‌క్రాస్ భవనంలో శనివారం జె.వి.వి. అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా 6వ రోజు జూనియర్, సీనియర్ విభాగాలలో "క్విజ్" పోటీలను నిర్వహించారు. జూనియర్ విభాగంలో 20 స్కూల్స్, సీనియర్ విభాగంలో 23 స్కూల్స్ పాల్గొన్నారు. మొత్తం 130మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాలలో ఎస్.రామకృష్ణ, ఆకుల.రమణయ్య, షేక్.జిలానీ భాషా క్విజ్ మాస్టర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 21వ తేదీ ఉదయం 9గంటల నుండి సైన్స్ ఎగ్జిబిషన్ (ప్రజ్ఞానిక ప్రదర్శన) నిర్వహిస్తామని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తప్పక విద్యార్థులను తీసుకొని ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరయ్యేటట్లు చూడాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు అయినందున వారు ముఖ్యంగా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, మూఢనమ్మకాల నుండి సామాజిక దురుగ్మతల నుండి సమాజాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు, సెక్రెటరీ గాదిరెడ్డి.హరినాథ్, కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు పాపిశెట్టి.జానకిరామ్, ఉపాధ్యక్షులు కె.మనోహరరెడ్డి, కార్యవర్గ సభ్యులు సి.శ్రీయ్య, ఎం.వి.ఎస్. ప్రసాద్ రావు, కె.జాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


క్రిష్ణారెడ్డిని మెజారిటీతో గెలిపించుకుందాం..

- ఎబిఎం సంఘం అధినేత జెడిబి దివాకర్

ప్రజాశక్తి-కావలి



కావలి నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేయబోతున్న కావ్య క్రిష్ణారెడ్డిని గొప్ప మెజార్టీతో గెలిపించాలని పిఎసిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎబిఎం సంఘం అధినేత జెడిబి దివాకర్ పిలుపునిచ్చారు. శనివారం కావ్య క్రిష్ణారెడ్డి దివాకర్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కావ్య క్రిష్ణారెడ్డి గెలుపు కోసం తాను ఉపవాసం చేస్తున్నానని, ఆయన విజయం సాధించే వరకు తన ఉపవాసం కొనసాగుతుందని దివాకర్ తెలియజేశారు. కావ్య క్రిష్ణారెడ్డి కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. క్రిష్ణారెడ్డి విజయం కోసం ప్రార్థన నిర్వహించారు. పాస్టర్లు రెవ. కె.మార్క్ బాబు, జెఎం ప్రాంక్లిన్, క్రైస్ట్ స్టుడెంట్ ఏసు బాబు, పాస్టర్స్ కన్వీనర్ పాడేటి థామస్, ఒంగోలు జగన్, జేడిస్సన్, రెవ జయపాల్ అడ్వకేట్ శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రూ.50వేలు నగదు వితరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో ఇటీవల మృతి చెందిన ఐదుగురికి శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.50వేలు నగదును కుటుంబ సభ్యులకు వితరణగా అందజేశారు. 23వ వార్డు పరిధిలోని నెల్లూరు పాలెం ముస్లిం కాలనీలో ఇటీవల మృతి చెందిన దండే కొండమ్మ కుటుంబ సభ్యులను నిత్య అన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి పరామర్శించి, ఆమె కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. 21వ వార్డు పరిధిలోని ఎల్ఐసి కార్యాలయం సమీపంలో ఇటీవల మృతి చెందిన ఇమామ్ హుస్సేన్ కుటుంబాన్ని పరామర్శించిన పరమేశ్వర రెడ్డి వారికి రూ.10వేలు నగదును అందజేశారు. 21వ వార్డు మోడల్ ఎస్‌టి కాలనీలోని ముట్లూరు రంగమ్మ అనే గిరిజనరాలు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. 20వ వార్డు పరిధిలోని ఎరుకలసాని నగర్లో ఇటీవల మృతిచెందిన కావాటి తిరుపతమ్మ కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇదేవిధంగా 7వ వార్డు పరిధిలోని ముస్లిం వీధిలోని ఇటీవల మృతి చెందిన షరీఫ్ కుటుంబాన్ని పరామర్శించిన నిత్య అన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి వారికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు కామాక్షయ్య నాయుడు, సూరా భాస్కర్ రెడ్డి, 7వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి జమీర్ భాషా, నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి అందిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు అశోక్ రెడ్డి, శేషారెడ్డి, కంది చంద్రన్న, మెప్మా ఆర్‌పిలు జబీనా, సుష్మ, ఆశా కార్యకర్త మహబూబ్ జానీ, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం ధ్యేయం

వైఎస్ఆర్ ఆసరా విజయోత్సవ సంబరాల్లో ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పొదుపు సంఘాల ద్వారా ప్రతీ అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా స్థితిమంతులను చేశారని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మీ సహకారం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రయివేట్ కళ్యాణ మండపంలో జరిగిన వైఎస్ఆర్ ఆసరా సంబరాలు విజయోత్సవ కార్యక్రమానికి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద మహిళలందరికీ ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కల్పించిన పొదుపు సంఘాలు విఎఒలు, మెప్మా రిసోర్స్ పర్సన్‌లు తమ సేవలను ఇలగే కొనసాగించాలన్నారు. ప్రతి మహిళను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందచేస్తున్న సంక్షేమ పథకాలతో



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

పాటు ఆర్థికంగా ఎదిగేందుకు ఏర్పాటు చేసిన ఇలాంటి పొదుపు సంఘాలతో పేదరికం తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు విడతల్లో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, గతంలో మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పుకున్న ప్రభుత్వం చేయకపోవడంతో మహిళలు ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలియజేశారు. పొదుపు సంఘాల్లోని సభ్యులు సరిగా రుణాలు చెల్లించలేక అనేకమంది పొదుపు గ్రూపుల్లో నుంచి వెళ్లిపోవడం జరిగిందని, 18శాతం పొదుపు సంఘాలు నిర్వీర్యమైపోయాయని, ఇలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదుపు గ్రూపులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించారన్నారు. దాంతో 18 నుండి కేవలం 2 శాతానికి పడిపోయిందన్నారు. జగనన్న అందజేస్తున్న ఆర్థిక సహకారంతో ప్రతీ మహిళ తమ కుటుంబాన్ని అభివృద్ధిలోకి తెచ్చుకున్నారని, దాంతో రాష్ట్రంలో పేదరికం కూడా తగ్గుముఖం పట్టిందని, సంక్షేమ ప్రభుత్వం కొనసాగేందుకు మీరు కూడా ఇలగే సహకారం అందించాలన్నారు. అనంతరం మహిళలకు కానుకలను అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, ఎంపిపిలు కేత వేణుగోపాల్ రెడ్డి, బోయళ్ల పద్మజారెడ్డి, సంపూర్ణమ్మ, జెడ్‌పిటిసిలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, పీర్ల పార్థసారథి, రఘునాథరెడ్డి, గంగవరపు శ్రీనివాసులు నాయుడు, ఐ వి రమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, రమేష్ రెడ్డి, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్ రెడ్డి, బట్టేపాడు పిఎసి చైర్మన్ బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, సయ్యద్ జమీర్, కొర్సిపాటి హరికిషోర్ రెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మేకపాటికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి

బండగానపల్లి - ఉదయగిరి ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని సిపిఎం, ఎపి రైతుసంఘం నాయకులు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డిని కోరి వినతిపత్రం అందజేశారు. శనివారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో అయని కలిసి ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి దాదాపు 15వేల మంది ప్రజానీకానికి తక్షణ రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన డిఎఫ్ఒ సంబంధిత ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి రవాణా సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారు.



పిఆర్‌సి అమలు చేయాలని నిరసన చేపడుతున్న జెఎసి నాయకులు

పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని నిరసన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఎపిజెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యయులు, కార్మిక, పెన్షనర్స్ ఆత్మకూరు తాలూకా తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరేండర్ లీవ్స్, టిఎ బిల్, మెడికల్ బిల్లు, 11వ పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు, 12వ పిఆర్‌సిలో ఐఆర్ 30శాతంను ప్రకటించాలని, అలాగే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ ను పునరుద్ధరణ చేయాలఇ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎపిజెఎసి చైర్మన్ బి.శైలజ, ప్రధాన కార్యదర్శి బల్లి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు, గోవర్ధన్, బషీరా, ట్రెజరర్ సుప్రియ, ఎస్.సుధాకర్, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సంఘం నాయకులు సుధాకర్, రజని, రేష్మ, గురుప్రసాద్, చాణిక్యం, వెంకటేశ్వరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు.



బ్రూనే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు

సత్యాన్వేషణ దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని ఎస్‌సి బాలుర వసతి గృహంలో సత్యాన్వేషణ దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆధునిక విజ్ఞాన శాస్త్రం అప్పటికి ఇంకా పురుడు పోసుకోలేదని తెలిపారు. మతం నమ్మకాలు బలంగా ఉన్న రోజులు సమస్త విశ్వం భూమి చుట్టూనే తిరుగుతుం దన్నారు. నమ్మే కాలం సకల గ్రహాలు భూమి కేంద్రంగా తిరుగుతున్నాయని, గట్టి విశ్వాసం సిద్ధాంతానికి తెరతీసిన రోజుల్లోనే ఇటలీ దేశంలో నేర్పుల్స్ సమీపంలో ఉన్న నోలా పట్టణంలో 1548లో జన్మించిన బ్రూనో తాను నమ్మిన విషయాన్ని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పేవాడని తెలిపారు. ఈ గ్రహాలకు కేంద్రం సూర్యుడు కానీ భూమి కాదని తేల్చి చెప్పాడన్నారు. కోపర్నికస్ కంటే కూడా ముందుకెళ్లి మనకు కనబడే నక్షత్ర రాశుల సూర్యుడు దాని చుట్టూ ఉండే గ్రహాలని చెప్పాడని తెలిపారు. ఆ గ్రహాల్లో భూమ్మీద లాగే జీవం ఉన్నా ఉండవచ్చని సూత్రీకరించి ప్రపంచం మేధావుల్లో సంచలనాన్ని సృష్టించాడని తెలిపారు. మత పెద్దలు భూ కేంద్ర సిద్ధాంతం కరెక్ట్ అని చెప్పమని, 7 సంవత్సరాల పాటు నిర్బంధించి క్రూరంగా హింసించినప్పటికీ అంగీకరించ లేదన్నారు. క్రీస్తుశకం 1600 ఫిబ్రవరి 17వ తేదీన బహిరంగంగా కాల్చి చంపారని తెలిపారు. వారిని చంపిన 300 సంవత్సరాల తరువాత బ్రూనో చెప్పిందే సరైనదని రుజువైందన్నారు. అందుకే వారిని హత్య చేసిన రోజునే సత్యాన్వేషణ దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుతున్నామని తెలిపారు. జెవివి నాయకులు హరికృష్ణ, లక్కు కృష్ణ ప్రసాద్, షేక్ సంధాని, సాదిక్ హుస్సేన్ నందా శ్రీను, గద్దర్ బాబు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఉదయగిరిలో...



అనంతసాగరంలో..



కావలిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి

మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థిని విద్యార్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమకుమార్ అవగాహన కల్పించారు. శనివారం స్థానిక వ్యవసాయ కళాశాలలో జరిగే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునే ప్రతీ విద్యార్థి సమర్ధవంతంగా నాయకుడిని ఎన్నుకునేందుకు మొదటి ఓటును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ ఓటు హక్కు ఈవిఎంలపై కుటుంబ సభ్యులకు తమతమ గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులు చేసే బాధ్యత యువతపై ఉందన్నారు. అనంతరం ఎన్నికల సందర్భంగా ఈవిఎం ఉపయోగం ఎలా ఓటును సద్వినియోగం చేసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ నెహ్రూ బాబు, కళాశాల డీన్ డాక్టర్ టివి గోపికృష్ణ, ఎపిఎం ఖాజా రహమతుల్లా, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనంతసాగరం : ఓటుహక్కు సద్వినియోగం చేసుకుని రాజ్యాంగాన్ని కాపాడాలి అంటూ అంగన్‌వాడీ వర్కర్లు, పిల్లల తల్లులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రాజెక్టు సూపర్‌వైజర్ శారద పాల్గొని మాట్లాడుతూ దేశంలో 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, అర్హులైన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీ ఓటరు కీలకపాత్ర పోషించాలని, ఓటు అనే వజ్రాయుధాన్ని సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు వినియోగించాలన్నారు. యువత గ్రామంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి ప్రతిఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగం రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కుగా భావించాలన్నారు. ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కొత్త ఓటర్లు ఇవిఎంలో జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కె.భాగ్యమ్మ, నాగమణి, సునీత, డి.భాగ్యమ్మ, అంగన్‌వాడీ హెల్పర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు - వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : నెహ్రూ యువ కేంద్రం, నెల్లూరు కోఆర్డినేటర్ మహీధర్ రెడ్డి సౌజన్యంతో" ప్రియదర్శిని మహిళామండలి" అధ్యక్షులు షేక్ ఖాదర్‌బీ ఆధ్వర్యంలో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల కావలిలో ఓటు హక్కు నమోదు- సద్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చైతన్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్, స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్ బాషా, ప్రియదర్శిని మహిళా మండలి షేక్ ఖాదర్‌బీ మాట్లాడారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, దేశ సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతాయని, మతం, జాతీ, కులం, వర్గం, భాష, తారతమ్యాలు లేకుండా ఎటువంటి ఒత్తిడిలకు, బంధు ప్రీతికి, ప్రలోభాలకు, ప్రభావితం కాకుండా, ప్రతీ ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేస్తామని" విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్యానికి ఆయుధం ఓటే పునాది అని, ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తును మార్చేస్తుందని తెలిపారు. దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, కాబట్టి అర్హులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తదుపరి కళాశాల విద్యార్థినులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, కళాశాల సిబ్బందితో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికాంత్, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ పివిసాయితేజ, రత్నమ్మ ట్రస్ట్, ఎం.వి.ఎన్. ప్రసాద్ రావు, జాగో సంస్థ షేక్.జమీర్, గుడ్‌మెన్ బ్రహ్మయ్య, టైం టు హెల్ప్ ఎన్.రమేష్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అనారోగ్య కారణాలతో వైద్యం చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ఓ బాధితుడికి శనివారం ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధిని అందజేశారు. మర్రిపాడు మండలానికి చెందిన కన్నెలూరి వెంకటరమణయ్య అనారోగ్య కారణాలతో వైద్యం చేయించుకోవడంతో ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, అతనని ఆదుకోవాలని స్థానిక నాయకులు ఎంఎల్ఎ మేకపాటికి తెలిపారు. స్పందించిన ఎంఎల్ఎ మేకపాటి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1.10లక్షలను మంజూరు చేయించి శనివారం ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో బాధితుడికి అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయించడంపై ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి, మంజూరు చేసిన ముఖ్యమంత్రి



చెక్కును అందజేస్తున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, భీమవరపు సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మండల బూత్ లెవెల్ మేనేజర్ రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీనివాసులు

పాఠశాలలో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గుడినరవ పాఠశాలలో ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన పఠనా సామర్థ్య నైపుణ్యాలను పరిశీలిస్తూ రెండవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలు గణిత విషయంలో చాలా మెరుగ్గా ఉన్న విద్యార్థులు చతుర్విధ ప్రక్రియలైన కూడికలు తీసివేతలు భాగాహారాలు, పెంచడాలు చాలా బాగుగా చేశారని ముఖ్యంగా గుణింతాలు చెబుతున్న రెండవ తరగతి విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థుల రాగిజావను రుచి చూసి రాగి పిండి, జాగ్రి తగుపాలలో వేసి బాగా రుచికరంగా రాగిజావ తయారు చేయని రాగిజావలో ఏలకులు వేయాలని, ఇంకా చాలా రుచిగా ఉంటుందని, మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో అన్ని రికార్డులను పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేసిన రసాయనాలను వాడుతూ ప్రతిరోజు టాయిలెట్స్‌ను కనీసం మూడుసార్లు శుభ్రం చేయాలని ఆయాకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆల్ఫ్రెడ్ పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన జనసైనికులు

ప్రజాశక్తి-కావలి : కావలి జనసేన పార్టీ జనసైనికులు పి.ఎ.సి. చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను శనివారం మర్యాద పూర్వకంగా మంగళగిరి పార్టీ ఆఫీసులో, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో కలిశారు. కావలిలోని సమస్యలను, బలాబలాల గురించి మనోహర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, గోపిశెట్టి శ్రీనివాసులు, పప్పు సురేష్ బాబు, కొమ్మన వంశీ, తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కావలి రూరల్ : మండల పరిధిలోని పెదపవని క్రాస్ రోడ్డు వద్ద నుండి సిరిపురం ఊర్లో వరకు వేయనున్న సిమెంట్ రోడ్డుకు, సిరిపురం నుండి చలంచర్లకు వేయనున్న తారు రోడ్డుకు శనివారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ముందుగా సిరిపురం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి జెసిబిను నడిపి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పెదపాడు క్రాస్‌రోడ్ వద్ద నుండి సిరిపురం ఊళ్లో వరకు సిమెంట్ రోడ్డును వేస్తున్నాట్లు తెలిపారు. సిరిపురం గ్రామం నుండి చలంచర్ల వరకు తారు రోడ్డు వేస్తారన్నారు. సుమారు రెండు కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని, ఇవేకాకుండా కావలి నియోజకవర్గంలో సుమారు రూ.20కోట్ల వ్యయంతో రోడ్లు వేస్తున్నామని, త్వరలో వాటికి కూడా శంకుస్థాపన కార్యక్రమాలు చేసి త్వరగా రోడ్డు పనులు పూర్తి అయ్యేటట్టు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిరిపురం సర్పంచ్ జక్కంపూడి రమేష్ బాబు, ఎంపిపి ఆలూరి కొండమ్మ, ఎఎంసి చైర్మన్ సన్నెబోయిన ప్రసాద్‌యాదవ్, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాయుడు రాంప్రసాద్, సిరిపురం మాజీ సర్పంచ్ కమతం బలరాం, కావలి వైసిపి పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, శ్రీశైలం బోర్డు మెంబర్ కేటిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, చలంచర్ల నాయకులు శ్రీహరి నాయుడు, సిరిపురం చాలంచర్ల, తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం

ప్రజాశక్తి -నెల్లూరు : జిల్లాలోని పొదలకూరు మండలం చాటగుట్ల, కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ గ్రామాలలో ఇటీవల ఎవిఎన్ ఇన్‌ఫ్లూఎంజా వ్యాధితో కోళ్లు పెద్దఎత్తున చనిపోవడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు భోపాల్‌లోని టెస్టింగ్ కేంద్రానికి పంపగా ఎవిఎన్ ఇన్‌ఫ్లూఎంజా నిర్ధారణ అయింది. దాంతో జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి కలకలం రేపింది. ఈ వ్యాధి ప్రబలకుండా అదుపు చేయడానికి జిల్లా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం, కోళ్లు మృతిచెందిన ప్రాంతానికి పది కిలోమీటర్ల పరిధిలో 3 రోజులపాటు చికెన్ షాపులు మూసివేయా లని ఒక కిలోమీటర్ పరిధిలో మూడు నెలల వరకు షాపులు తెరవకూడదని ఆ ప్రకారం సంభం దిత అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తాము ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ఉద్యోగులగా తాము ప్రభుత్వం దగ్గర దాచుకున్న జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ డబ్బులు, 11వ పిఆర్‌సి పెండింగ్ బకాయిలు అయిన డిఎ ఎరియర్స్, తమకు రావాల్సిన డిఎలు, డిఆర్‌లు, 3 సంవత్సరాలుగా ఆగిపోయిన 3 సరెండర్ లీవ్ డబ్బులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ డబ్బులు అందజేయాలన్నారు. అదేవిధంగా పెన్షనర్లకు అదనంగా గతంలో ఇస్తున్న అదనపు క్వాంటమ్ 70 సంవత్సరాలకు 10శాతం 75 సంవత్సరాలకు 15శాతం ఇవ్వాలని, ప్రస్తుత సిఎం 2019లో ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలైన సిపిఎస్ ఉద్యోగులను ఒపిఎస్ ఉద్యోగులుగా పరిగణలోకి తీసుకోవాలన్నారు.


వీక్షణం

కృష్ణపట్నం పోర్టుకు సంబంధించిన కంటైనర్ టర్మినల్‌ను చెన్నయ్‌కు తరలించేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని తక్షణమే ఈ ఆలోచన విరమించుకోవాలని కార్మిక, రైతు, ప్రజాసంఘాల ప్రతినిధులు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్న కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెబాట పట్టారు. దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్ భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బంద్ విజయవంతం అయింది. నగరంతో పాటు కావలి, ఉదయగిరి, కోవూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు, టిపిగూడూరు, ఆత్మకూరుల, జలదంకితోపాటు అన్ని ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు జరిగాయి. నగరం, రూరల్ నియోజకవర్గ పరిధిలోని కార్మిక సంఘాలు, రవాణా రంగం కార్మికులు సంయుక్తంగా ఆర్టీసి బస్టాండ్ నుంచి నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతంలోని స్వతంత్ర పార్కు వరకు భారీ స్థాయిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్వతంత్ర పార్కు నుంచి నగర, రూరల్ నియోజకవర్గాలకు చెందిన కార్మిక, రవాణా, వ్యవసాయ, రైతాంగ, భవన నిర్మాణ రంగాలకు చెందిన కార్మికులతో భారీ ప్రదర్శనగా విఆర్సి సెంటర్కు చేరుకున్నారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయం ఎదుట బహిరంగ సభను నిర్వహించారు.



రేషన్ వ్యాన్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావు పేట పంచాయితీ కొత్తూరు గ్రామంలో ఉన్న 8వ రేషన్ షాపు డీలర్ సాతుపాటి ప్రమీలతో రేషన్ సరుకులు ఇచ్చేందుకు వచ్చిన వాహనాన్ని గ్రామస్తులు అందరూ ఏకమై శనివారం అడ్డుకున్నారు. గత 6నెలలుగా తమ గ్రామంలో సక్రమంగా రేషన్ పంపిణీ జరుగని కారణంగా రేషన్ డీలర్‌ను అందరూ నిలదీశారు. తమ గ్రామంలో డీలర్‌కు 240 తెల్ల రేషన్ కార్డులు ఉండగా వీటికి గానూ నెలకు 66 బస్తాల బియ్యం అవసరమై ఉంది. వాటితోపాటు చక్కెర, కందిపప్పు మొదలగు సరుకులను కూడా ఇవ్వాల్సి ఉందని, గతంలో ఈ గ్రామంలో 10, 11వ తేదీల్లో రేషన్ బట్వాడా జరుగుతూ ఉండేదన్నారు. గత ఆరు నెలలుగా రేషన్ పంపిణీ చేసేందుకు చివరి రోజులైనా 16, 17 తేదీలలో గ్రామంలో కొద్ది మందికి, కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నట్లు, చక్కెర, కందిపప్పు అసలు పూర్తిగా ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంపై గ్రామస్తులందరూ తహశీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు డీలర్‌పై తీసుకోలేదన్నారు. గతంలో కూడా ఇతనిపై అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ రేషన్‌కు సంబంధించిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించిన తీరు ఆశ్చర్యకరంగా ఉంటుందని తెలిపారు. గత ఆరు నెలలుగా మండలంలోని రేషన్ డీలర్లు అందరూ తమ వినియోగదారులకు 16వ తేదీ లోపల బియ్యం పంపిణీ పూర్తి చేసిన తర్వాత వారి వద్ద మిగిలి ఉన్న బియ్యం బస్తాలను 17వ తేదీన తీసుకుని వచ్చి, అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిద్రమత్తు వదిలి గ్రామంలోని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా రేషన్ సరుకులు ఇప్పించాలని కోరుతున్నామన్నారు. ఇప్పుడున్న ఈ డీలరుపై సరైన విచారణ చేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కొత్త డీలర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులందరం కోరుతున్నామన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న అధికారి

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి-వరికుంటపాడు: రైతు భరోసా కేంద్రం పరిధిలో కనియంపాడు గ్రామంలో సాగు చేయుచున్న వరి పంటను వ్యవసాయ అధికారి రవికుమార్, విఎఎ చంద్రశేఖర్ శనివారం సందర్శించి రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సస్యరక్షణ పద్ధతులతో పాటు కలుపు యాజమాన్యం పాటిస్తే మంచి దిగుబడిని పొందవ చ్చున్నారు. నాటిన 25-30 రోజులప్పుడు పొలంలో వెడల్పాటి కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 2, 4- డి సోడియం సాల్ట్ 400 గ్రాములు ఒక ఎకరానికి నీటితో కలిపి పిచికారి చేయాలని, అలాగే తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు ఉంటే ఎకరాకు 500 మిల్లీలీటర్ల బెంటజోన్ కలుపు మందును పిచికారి చేయాలని తెలిపారు. అలాగే పిలక దశలో ఆశించే కాండం తొలిచే పురుగు నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి 8 కిలోలు లేదా క్లోరంట్రానిలిప్రోల్ గుళికలు 4 కిలోలు వాడాలని తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు ఇకెవైసి ప్రక్రియను 22వ తేదీ లోపు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వరికుంటపాడు, కనియంపాడు రైతులు పాల్గొన్నారు.

చికెన్ విక్రయ షాపులు మూసేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ హరినారాయణన్, నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్‌ల ఆదేశాల మేరకు చికెన్ షాపులను స్వచ్ఛందంగా మూసివేయాలని, ప్రజలంతా చికెన్ ఆధారిత ఆహార పదార్థాలను భుజించవద్దని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.వెంకట రమణ తెలిపారు. అధికారులతో కలిసి చిన్న బజారు సమీపంలోని చికెన్ మార్కెట్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. నిల్వ ఉన్న చికెన్‌ను స్వాధీనం చేసుకుని, షాపులను మూయించారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఎవరూ చికెన్ విక్రయాలు, కొనుగోలు జరపరాదన్నారు. హోటళ్లు, రెస్టారెంట్‌లు, బార్లు, క్రరీస్ పాయింట్లలో చికెన్ విక్రయాలు జరపడాన్ని నిషేధించామన్నారు. ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్, రొయ్యలు వంటి మాంసపు ఉత్పత్తులను ఆహారంగా వినియోగించుకోవాలన్నారు. ఆదేశాలను ఉల్లఘించే షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆరోగ్య శాఖ సూపర్ వైజర్లు, శేషయ్య, సురేంద్రనాథ్, ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



చికెన్‌షాపులో చికెన్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

నిర్దేశాలను క్రమశిక్షణగా పాటించాలి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా తమ విధులను నిర్వర్తించి ఎన్నికల సంఘం సూచించిన నిర్దేశాలను క్రమశిక్షణగా అమలు చేయాలని ఈ.ఆర్.ఒ, కమిషనర్ వికాస్ మర్మత్, అధికారులకు సూచించారు. సెక్టర్ అధికారులు, ఏ.ఈ.ఆర్.ఓలు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్‌తో నెల్లూరు సిటీ నియోజకవర్గంపై సమీక్షా సమావేశాన్ని కమాండ్ కంట్రోల్ విభాగంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విభాగం సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం సూచించిన నిర్దేశాలను క్రమశిక్షణగా పాటిస్తూ, ఎన్నికల సంఘం అందించే ట్రైనింగ్‌లో సంపూర్ణంగా శిక్షణ పొందాలన్నారు. ఈ.వి.ఎం మెషిన్లు, వి.వి పాట్లపై సంపూర్ణ ంగా అవగాహన పెంచుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులను ఎప్పటికప్పుడు పరిశీలించుకుని, మాక్ పోలింగ్ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.సమావేశంలో ఏ.ఈ.ఆర్.ఓ లు, పి . దేవి కుమారి, వెంకటేశ్వరరావు, ప్రసాదరావు, సెక్టార్ అధి కారులు, ఏ.ఎల్.ఎం.టి.లు, ఈ.డి.టి, స్వర్ణ, టి.పి.ఆర్.ఒ ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

వలంటీర్ల సేవలు గొప్పవి: ఆదాల

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

నవ రాజా బి వద్ధి లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థలో భాగస్తులైన వలంటీర్లు నాయకుల కంటే కూడా గొప్ప ప్రజా సేవకులని నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రశంసించారు. ఈ మేరకు శనివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని 20, 21, 22, 23, 24, 25 మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లలో ఆయా సచివాలయాల్లో పనిచేస్తున్న వాలంటీర్లకు జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆలోచిస్తు న్నారని చెప్పారు. తాను అనేకమార్లు సిఎం జగనన్నకు వాలంటీర్ల సేవలు, వారి సమస్యలపైన చర్చించడం జరిగిందని తప్పకుండా భవిష్యత్తులో వాలంటీర్ల సేవలు గుర్తింపుఇవ్వడం జరుగ ుతుందని వ్యాఖ్యానించడం మంచి



మాట్లాడుతున్న ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థలో అత్యంత కీలకంగా ప్రజలకి సేవలు అందిస్తున్న వాలంటీర్లను ఘనంగా సన్మానించుకోవడం తమ అదష్టంగా భావిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో వాలంటీర్లకు గొప్ప మేలు జరిగే పరిణామన్నారు.కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పోట్లూరు స్రవంతి జయవర్ధన్, నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సవక తోట దగ్ధం

ప్రజాశక్తి-సంగం

మండలంలోని పడమటిపాలెం పంచాయతీ పల్లిపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నెల్లూరు ఆదిశేషయ్య, వెంకట రమణయ్య అనే రైతులకు సంబందించిన 15 ఎకరాల సవక తోట దగ్ధమైంది. వెంటనే గమనించిన రైతులు స్థానికులతో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.10లక్షల నష్టం జరిగిందని రైతులు తెలియజేశారు.

చిన్నారి కుటుంబానికి పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

అల్లీపురం టిడ్కో ఇళ్లకి తరలించిన కుటుంబాల్లో కరెంటు మీటర్లు నేలపైనే ఉండడం అవి డోర్స్ తీసి ఉండడంతో మరణించిన చిన్నారి కుటుంబానికి పరిహారం నిమిత్తం గత సంవత్సరం ఆగస్టులో కలెక్టర్‌కు వినిపించినప్పటికీ ఇప్పటికీ బాధితులని ప్రభుత్వం ఆదుకోలేదు. ఈ విషయాన్ని నెల్లూరు రూరల్ తహశీల్దార్ అందుబాటులో లేకపోవడం శనివారం డిప్యూటీ తహశీల్దార్ దష్టికి తీసుకువచ్చి బాధితులకు న్యాయం చేయాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల కోరారు.వెంటనే పరిహారం చెల్లించాలని తెలిపారు.



ప్రచారం చేస్తున్న మాజీమంత్రి నారాయణ సతీమణి

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ఏ ఇంటికి వెళ్లిన.. ఏ డివిజన్‌కి వెళ్లిన గతంలో నారాయణ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన విధానం గురించే ప్రజలు తెలుపుతున్నారని నారాయణను గెలిపించి తీరుతామని కొండంత భరోసా ఇస్తున్నారని దీంతో చాలా సంతోషంగా ఉందని మాజీమంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి తెలిపారు.నెల్లూరు నగరం 40 వ డివిజన్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె ప్రతీ ఇంటికెళ్లి...రాబోయే ఎన్నికల్లో నారాయణకు అండగా నిలవాలని అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏ డివిజన్ కెళ్లినా...టీడీపీ ప్రభుత్వానికి మంచి స్పందన వస్తుందన్నారు. నారాయణ చేసిన అభివద్ధిని నాకు తెలియజేస్తూ...రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా గెలిపించుకొని తీరుతామని చెబుతుండడం చాలా సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో గండవరం నాని, రాజేశ్వరి, తుమ్మల కష్ణ, అమ్మణ్ణి, గండవరం హనుమ, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రాజధాని ఫైల్స్'ను అడ్డుకోవడం దారుణం

ప్రజాశక్తి-కావలి: రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శన అడ్డుకోవడం దారుణమని, పిరికిపంద చర్య అని కావలి టిడిపి నేతలు పేర్కొన్నారు. శనివారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ముసునూరు టిడిపి కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపక్షంలో ఉన్నప్పుడు రాజధాని ఏర్పాటుకు స్వాగతిస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే మూడు రాజధానులు పేరుతో డ్రామాలు ఆడింది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. వేలమంది రైతులను రోడ్డున పడేసింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. సామాజిక బాధ్యతతో వాస్తవాలను సినిమాగా చేస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. రాజధాని ఫైల్స్ సినిమా చూస్తే తనను ప్రజలు ఎక్కడ చీకొడతారో అని జగన్‌రెడ్డి భయపడ్డారని, అందుకే ఇలా దిగజారుడు చర్యలకు దిగారన్నారు. సినీ ప్రదర్శనను అడ్డుకున్న జగన్ రెడ్డి ఐదేళ్ల తన చెత్త పాలనపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను ఆపగలరా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోవడం ఖాయమని టిడిపి - జనసేన కూటమి గెలవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి తటవర్తి వాసు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.